క్లుప్తంగా

దర్గాలో చాదర్ సమర్పించిన వెలంపల్లి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే పుణ్యక్షేత్రమైన అజ్మీర్‌లోని ఖాజా గరీబున్ నవాజ్ గంధం మహోత్సవాలను పురస్కరించుకుని ప్రకాశం బ్యారేజీ సమీపంలో 38వ డివిజన్ పరిధిలోని హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాదిరి దర్గాలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం చాదర్ సమర్పించారు. నజీర్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం జరిగిన అన్నసంతర్పణలో వెలంపల్లి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ హయాత్ షరీఫ్, ఎస్కే నజీర్, ఎండీ గౌస్, ఫారూక్, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాల్లో లోపం లేకుండా చూడాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు లేకుండా అధికారులు నిరంతర నిఘా ఉంచాలని వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సర్కిల్–2 పరిధిలోని జరిగే అభివృద్ధి పనులపై ఆయన ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరదలు తర్వాత దెబ్బతిన్న రోడ్లను త్వరితగతిన మరమ్మతులు చేసి, ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

దొడ్డిదారిలో ప్రజలపై విద్యుత్ భారాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు దొడ్డిదారిలో భారం మోపుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కమ్స్ ప్రతిపాదించిన ఎఆర్ఆర్‌పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి విజయవాడలో మంగళవారం విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో అన్ని పనులను అదానికి అప్పగిస్తూ, ఆ రంగాన్ని అదానీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీగా మారుస్తున్నారని విమర్శించారు. ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ వంటి పేర్లతో డిస్కమ్‌లు రూ.వేల కోట్లు వసూలు చేస్తు ఏఆర్ఆర్‌లో భారాలు మోపడం లేదని పచ్చి అబద్దాలు చెబుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రకాల పేర్లతో రూ.72 వేల కోట్లు భారాన్ని కొత్త ప్రభుత్వం వినియోగదారులపై మోపిందన్నారు. ప్రతి నెలా 40 పైసలు చొప్పున ముందుగానే డిస్కమ్‌లు వసూలు చేస్తున్నాయన్నారు. దీనిని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. విజయవాడలో రెండు యూనిట్లు వాడిన వినియోగదారునికి రూ.910 బిల్లు వచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి మాటతప్పి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లందరిని ఆప్కాస్‌లో చేర్చి.. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ వద్ద మంగళవారం ఆటోలు ఆపి ఆరో రోజు ధర్నా నిర్వహించారు. క్లాప్ ఆటో యూనియన్ కన్వీనర్ శివ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో దుర్గారావు పాల్గొని ప్రసంగించారు. క్లాప్ ఆటో డ్రైవర్లను ఆప్కాస్ సంస్థలో చేర్చకపోవడం వల్ల వారందరు శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కూడా లేవని కూటమి ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబస్సు మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీనే జీతాలు ఇవ్వాలని.. పండుగ సెలవులు, ఆదివారం ఫుల్ డే సెలవులతో పాటుగా రూ. 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నగర కోశాధికారి డి.స్టీఫెన్ బాబు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర సహాయ కార్యదర్శి శీలం దాస్, క్లాప్ ఆటో యూనియన్ కార్మికులు రుద్ర, రామరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ముప్పు ఉన్నా గదుల నిర్మాణం

- భవానీ ద్వీపంలో అనాలోచిత నిర్ణయాలు
- నత్తనడకన రూముల ఆధునికీకరణ పనులు
- మొదలై 10 నెలలయినా పూర్తికాని వైనం
- గదులు లేక వెనుదిరుగుతున్న పర్యాటకులు
- ఏపీటీడీసీ ఆదాయానికి భారీ గండి



భవానీ ద్వీపంలో గ్రాండ్ ఫ్లోర్‌లో కొత్తగా నిర్మిస్తున్న రూములు



బెరంపార్క్‌లో కొనసాగుతున్న రూముల ఆధునికీకరణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారుల అనాలోచిత నిర్ణయాలతో సంస్థ ఆదాయానికి భారీ గండి పడుతోంది. ఇప్పటికే రెండు సార్లు వచ్చిన వరదల కారణంగా భవానీ ద్వీపంలోకి దాదాపు పది అడుగులపైనే వరద నీరు చేరింది. తద్వారా ద్వీపానికి భారీ నష్టం వాటిల్లింది. అయినా ముంపు నివారణ చర్యలు తీసుకోని అధికారులు పాడైపోయిన ఎనిమిది రూములను ఆధునికీకరించటంతో పాటు ఇప్పుడు కొత్తగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మరో ఎనిమిది గదులు నిర్మిస్తున్నారు. వరద వస్తే గ్రౌండ్ ఫ్లోర్ వరకు మునిగిపోతుందని తెలిసినా, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్తగా గదులు నిర్మించడంపై పర్యాటకులు విస్తుపోతున్నారు. ఇటీవల సంభవించిన వరద కారణంగా పూర్తిగా దెబ్బతిన్న ద్వీపాన్ని ఇంత వరకు పునరుద్ధరించలేదు. ఇప్పుడు నూతనంగా ఎనిమిది గదులు నిర్మాణం అవసరమా అంటూ పెదవి విరుస్తున్నారు. ఒక వైపు ఆదాయానికి భారీగా గండి పడుతున్న తరుణంలో టూరిజం శాఖకు సంబంధించిన సదస్సులను ప్రైవేట్ హోటల్స్‌లో నిర్వహించటం, అందుకు లక్షలాది రూపాయలను ఖర్చు చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల తీరు ఇలానే ఉంటే భవిష్యత్‌లో తమ జీతాలు చెల్లించ లేని పరిస్థితి ఏర్పడినా ఆశ్చర్యపడనక్కర లేదని ఆ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

విజయవాడ డివిజన్‌లో..

ఏపీ పర్యాటక శాఖ సంస్థ విజయవాడ డివిజన్ పరిధిలో మొత్తం 34 రూములను ఆధునికీకరిస్తున్నారు. విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో మొత్తం 30 రూములు ఉండగా వాటిల్లో 10 రూములు ఆధునీకరణ పేరుతో ఎవరికీ ఇవ్వటం లేదు. భవానీ ద్వీపంలో మొత్తం 29 రూములు ఉండగా వాటిల్లో ఎనిమిది గదులను ఆధునికీకరిస్తున్నారు. సూర్యలంకలో 40 రూములుండగా 16 గదులను ఆధునికీకరిస్తున్నారు. వీటన్నింటి పనులు మొదలుపెట్టి దాదాపు 10 నెలలయినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆయా పర్యాటక ప్రదేశాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఉన్న రూములు సరిపోవడం లేదు. దీంతో చాలా మంది పర్యాటకులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఈ క్రమంలో రూముల అద్దెతోపాటు పర్యాటకులకు అందించే ఆతిథ్య సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా ఏపీటీడీసీ కోల్పోతోంది. రూముల ఆధునికీకరణ పనులపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లకే పరిమితం అవుతున్నారు తప్ప కార్యాచరణకు నోచుకోవడం లేదు. 'అతిథి దేవోభవ' అన్న నినాదంతో నడుస్తున్న విజయవాడ డివిజన్‌లోని భవానీ ద్వీపం, హరిత బెరంపార్క్, సూర్యలంక బీచ్ ప్రాంతాల అభివృద్ధిపై ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి కాట, చైర్మన్ నూకసాని బాలాజీ దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ల బకాయి బిల్లులు చెల్లించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన బీఏఐ



బీఏఐ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిపడిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా చెల్లించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఒక హోటల్లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) సమావేశం మంగళవారం జరిగింది. ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల రుణాల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన యువ కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపి, నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.2 వేల కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి ఆత్మహత్య వంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడంలో ఆలస్యం అవుతున్నాయని వివరించారు. పనులు చేసేటప్పుడు చేసిన అప్పులు, వాటిపై వడ్డీ భారం పెరిగి కాంట్రాక్టర్లు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతున్నారని నాయకులు వివరించారు. తమ కష్టాలను గుర్తించి ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఇవ్వాల్సిన బిల్లులను సకాలంలో మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డి.పంకజ్ రెడ్డి, వల్లభనేని వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, ఎ.నాగమల్లేశ్వరరావు, సిహెచ్.రామకోటయ్య, పి.రాజబాబు, పలువురు చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న చిన్నారులు



కచేరి చేస్తున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురునానక్ నగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్ 42వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఉత్సాహంగా జరిగింది. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌కేపీవీవీ విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కూడా మాతృభాషను నేర్పిస్తూ తెలుగు భాషా సంస్కృతులు, శతకాలు బోధించడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యున్నత సాంకేతిక విలువలుగల ఇన్నోవేషన్ లాబరేటరీ కలిగి ఉండటం, విద్యార్థులు డ్రోన్ల తయారీ, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్‌లో ప్రతిభను చాటుకుంటున్నారని అభినందించారు. ఈ ఏడాది లార్జెస్ట్ ఎలక్ట్రానిక్ కీ బోర్డ్ అసెంబుల్ చేయడం ద్వారా 4, 5 తరగతులు చదువుతున్న ఎస్.ఆరిన్, ఎస్.అహేలియ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి.వి.ఎస్.ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్



చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వరరావు, సీఐ అబ్దుల్‌సలాం

విజయవాడస్పోర్ట్స్: పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సులోని దుస్తుల బేళ్లు దొంగిలించిన నిందితులను విజయవాడ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.45 వేలు విలువైన రెండు బేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ వెంకటేశ్వరరావు, సీఐ అబ్దుల్‌సలాం మంగళవారం వెల్లడించారు. ఆర్టీసీ కార్గో పార్సిల్ కౌంటర్‌లో దుస్తుల బేళ్లు వేసుకుని హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులో గత నెల 19వ తేదీన చోరీ జరిగింది. బస్సు డిక్కీలో ఉన్న రెండు బేళ్లు తీసుకుని కొందరు వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారు. బస్సు డ్రైవర్ గత నెల 23వ తేదీన కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా నరసింహులుపేటకు చెందిన బి.బాలు, బి.హరికృష్ణ, జి.కల్యాణ్, బి.రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులపై నరసింహులుపేట, గుంటూరు, ఖమ్మం, నేలకొండపల్లి, కూసుమంచి, మహబూబాబాద్, హనుమకొండ, కాన్పూర్, కేంప్లల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మర్రిపెడ పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయని చెప్పారు. బస్సులో చోరీ చేసిన బేళ్లను పద్మావతి ఘాట్ వద్ద దాచి, వారి సొంత గ్రామానికి వెళ్లిపోయారని, తిరిగి మంగళవారం నగరానికి చేరుకుని దాచిన వస్తువులను తీస్తుండగా నలుగురిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలి

విజయవాడ కల్చరల్: నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. శ్రీధర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం 'ప్రేమకు పరాకాష్ట' అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం నాటకం నాడు సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను ప్రస్తావిస్తూ రాసినట్లు గుర్తుచేశారు. కంఠాభరణం, వరవిక్రయం, మా భూమి లాంటి నాటికలు సామాజిక సమస్యలతో సాగాయని చెప్పారు. సమాజంలో ప్రేమ రాహిత్య మనుషులు కనిపిస్తూ ఉంటారని.. వారికి ప్రేమను పంచి సమాజంలో మనుషులుగా గుర్తించాలనే సందేశంతో నాటకం సాగుతుంది. నాటకంలో నటించిన మోహన్, మనుప్రియ, రమేష్ గౌడ్‌ను వేముల హజరత్తయ్యగుప్తా, నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా బూదాల సౌమ్య (విజయవాడ ఈస్ట్), వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా చంద్రకిరణ్ తేజ (విజయవాడ ఈస్ట్), లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా చెంగవల్లి సాయిరామ్ (సెంట్రల్), కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా మట్టా నారాయణరావు (సెంట్రల్), పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా మేడా రమేష్ (విజయవాడ సెంట్రల్) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రెండేళ్ల బిడ్డ సహా తల్లి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రెండేళ్ల బిడ్డ సహా తల్లి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట బెజ్జాల మేడ సందు ప్రాంతానికి చెందిన యువతి మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. ఒక బాబు పుట్టిన తర్వాత భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేసేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి ఆ యువతి తన రెండేళ్ల బాబును తీసుకుని తన ఆడపడుచు ఇంటికని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల ఆమె కోసం గాలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. స్వాతి సెంటర్‌కు చెందిన ఓ వ్యక్తి కారణంగానే తన కుమార్తె అదృశ్యమైందని అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

బాలికపై అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికకు మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన రిక్షాపుల్లర్‌పై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మంగారి మఠం ప్రాంతానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. బాలిక (11) పెద్దమ్మ కుమారుడికి అనారోగ్యంగా ఉండటంతో షేక్ రాజా హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. సోమవారం రాత్రి అన్నను చూసేందుకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో శ్రీనివాస మహల్ సమీపంలోని గంగానమ్మ గుడి వద్ద కోపెల బాలస్వామి అనే రిక్షా పుల్లర్ మాయమాటలు చెప్పాడు. తన రిక్షాలో ఇంటి వద్ద దింపుతానని నమ్మించి ప్రైజర్‌పేట కొండప్రాంతంలోని తన ఇంటికి తీసుకువెళ్లి తలుపులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. అయితే అప్పటికే బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు గుర్తించారు. బాలిక రిక్షాలో వెళ్తుండటం చూసి అతని గురించి ఆరా తీశారు. రిక్షా పుల్లర్ ఇంటికి వెళ్లి బాలికను గుర్తించారు. ఘటనపై బాలిక తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆత్మీయ కలయిక

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకుడు పోతిన వెంకట మహేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని అధినేత కార్యాలయానికి వెళ్లి కలిశారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)



వైఎస్ జగన్‌తో పోతిన మహేష్

జగన్‌కు మక్కా ప్రసాదాల అందజేత



జగన్‌తో ఆసిఫ్ కుటుంబ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ పీఏసీ సభ్యుడు షేక్ ఆసిఫ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం భేటీ అయ్యారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫ్ కుమార్తె రేష్మా, కుమారుడు జావీద్ ఇటీవల మక్కాను దర్శించి వచ్చిన సందర్భంగా వారు అక్కడి నుంచి తీసుకొచ్చిన ఖర్జూరం, జమ్‌జమ్ నీటిని జగన్‌కు అందజేశారు. ఆసిఫ్ కుమార్తెతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన ఆమె కుమారుడి గురించి వివరాలను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు.

మునిసిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): మునిసిపల్ విభాగంలో దీర్ఘకాలంలో ఉద్యోగులు ప్రమోషన్లు లేకుండా ఒకే క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్నారని, వారికి త్వరితగతిన ఉద్యోగోన్నతి కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరరావు కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దష్టికి తీసుకొచ్చామని, వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.శివరామ ప్రసాద్, ఎ.శ్రీకృష్ణదేవరాయలు, సలీం అహ్మద్, ఓ.రాంబాబు, గుర్రం ప్రకాష్ సాగర్, కె.సురేంద్ర కుమార్, మారుతీరావు, బి.ఉదయ భాస్కర్, కె.శారదారాణి, డి.వెంకటేశ్వరరావు, జయప్రభు, మూర్తి, పి.మధుసూదనరావు, శుభకరరావు, ఓ.కరుణ, అహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ కుటుంబాన్ని పరామర్శించిన వెలంపల్లి



మృతుడు కల్యాణ్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం కొత్తపేటలోగల పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు చేసిన అవమానాలను తట్టుకోలేక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న బోయి కల్యాణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని సితార సెంటర్‌లో ఉన్న కల్యాణ్ రెడ్డి నివాసానికి వెళ్లి మృతుడి తల్లిదండ్రులు బోయి రామచంద్రారెడ్డి, భారతి, సోదరుడు దిలీప్‌రెడ్డిని కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. ఎంతో ఉన్నత భవిష్యత్ ఉన్న యువకుడు అకాల మరణం పొందటం బాధాకరమని అన్నారు. కల్యాణ్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. కల్యాణ్ రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేవరకు వైఎస్సార్ సీపీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్నాటి రాంబాబు, బోర మల్లేశ్వరరెడ్డి, సరగడ శంకరరెడ్డి, ఉండెల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తమకు కావాల్సిన పుస్తకాలను పరిశీలిస్తున్న సందర్శకులు

సందర్శకుల సందడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవానికి సందర్శకులు పోటెత్తుతున్నారు. మంగళవారం పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలతో తరలివచ్చారు. చిన్నారులకు ఇష్టమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. స్టాళ్లు అన్నీ సందర్శకులతో కిటకిటలాడుతూ కనిపించాయి. ప్రతిభా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.



ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పుస్తకాలను పరిశీలిస్తున్న సందర్శకులు





నాడు సురక్షితం.. నేడు నిర్వీర్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'మన బడి నాడు – నేడు' కింద ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక బాటపట్టాయి. సరికొత్త బ్లాక్‌బోర్డులు, బల్లలు, ఫ్యాన్లు, లైట్లు వంటి సకల సదుపాయాలతో తరగతి గదులు అందుబాటులోకి వచ్చాయి. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు విద్యార్థులకు సురక్షిత మంచినీటిని అందించాయి. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తోంది. నిర్వహణ సరిగా లేక ఆర్వో ప్లాంట్లు మూలన పడుతున్నాయి. విద్యార్థులు ఇళ్ల నుంచే మంచి నీటిని బాటిళ్లలో తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. విజయవాడలోని ఎంకే బేగ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు నిర్వహణ సరిగా లేక మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు బాటిళ్లలో మంచి నీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. పనిచేయని ఆర్వో ప్లాంటు, విద్యార్థులు తెచ్చుకున్న మంచినీటి బాటిళ్లను ఈ చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ